



చౌడేశ్వరీదేవి హుండీ ఆదాయం రూ.5.76 లక్షలు
● ఉగాది సందర్భంగా భక్తుల సందడి 7

బోంఢాం..!





● భారీగా తగ్గిన కొబ్బరి దిగుబడి ● పంటను వెంటాడుతున్న తెగులు
● కొండెక్కిన ధరలు.. ● అయినా రైతుకు తప్పని నష్టాలు



తుమకూరు జిల్లా తిపటూరు వద్ద కొబ్బరితోట

బెంగళూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కొబ్బరి రైతులకు ఈ ఏడు భారీ నష్టాలు మిగిలాయి. పంటకు పలురకాల వ్యాధులతో దిగుబడి భారీగా పడిపోయింది. ధరలు పెరిగినా లాభాలు లేవని రైతులు వాపోతున్నారు. కొబ్బరి కాయలేకుండా ఎటువంటి పూజలు సాగవు. ఆహార పదార్థాలకు కొబ్బరి తప్పనిసరి. ఇక కొబ్బరినూనె వాడకం సాధారణం. ఇలా ప్రతి మనిషికి నిత్యం ఏదో ఒకవిధంగా కొబ్బరితో అనుబంధం ఉంది. వాతావరణంలో మార్పులు, కొన్నేళ్లుగా వెంటాడుతున్న రోగాలతో కొబ్బరి దిగుబడి బాగా పడిపోయింది. ఈ ప్రభావం కొనుగోలుదారుడిపై పడింది. ఒక్కసారిగా కొబ్బరిధర కొండెక్కినట్లయ్యింది.

కేరళ తర్వాత రాష్ట్రంలోనే..

దక్షిణ భారతదేశంలో అత్యధికంగా కొబ్బరి సాగు అయ్యే రాష్ట్రం కేరళ . అనుబంధంగా ఉండే కర్ణాటకలోని పలు జిల్లాల్లో అదే వాతావరణం నెలకొని ఉంటుంది. ఇలా సుమారు పది జిల్లాల్లో కొబ్బరి సాగు చేస్తారు. కొబ్బరితోపాటు వక్క, తమలపాకు అంతరపంటలుగా ఉంటాయి. పంట ఏదైనా పొలంగట్లలో కొబ్బరిచెట్లు పెంచుతారు. శివమొగ్గ, హాసన్, తుమకూరు, దక్షిణకన్నడ, ఉత్తరకన్నడ, ఉడుపి జిల్లాల్లో ఎటు చూసినా కొబ్బరితోటలు కనిపిస్తాయి. గడిచిన ఏడాది తీవ్రమైన కరువు రావడంతో భూగర్భజలం తగ్గి కొన్ని ప్రాంతాల్లో కొబ్బరిచెట్లు ఎండిపోయాయి. ఇక రోగాలు వెంటాడుతుండడం మరో శాపంగా మారింది. రాష్ట్రంలో ఈ ఏడాది కొబ్బరి 25-35శాతం దాకా దిగుబడి తగ్గింది. కొబ్బరిబోండాల ధరలు నాలుగైదు నెలలుగా పెరుగుతూనే ఉన్నాయి. సాధారణంగా బోండాం ధర 30రూపాయలుగా ఉండేది. వేసవి ప్రారంభంలోనే ఎండలు మండిపోతుండంతో ధర రూ.60-70దాకా ధర పలుకుతోంది.

టెంకాయ ధరలు అంతంతే..

కొబ్బరి సాగు చేసే రైతుకు ఓ వింత సమస్య వెంటాడుతూనే ఉంది. కొబ్బరిబోండం రూ.40-50 దాకా పలుకుతుండగా టెంకాయ ధర మాత్రం రూ.30 మించడం లేదు. కొబ్బరి బోండాం టెంకాయగా మారాలంటే కనీసం ఐదారు నెలలు వేచి ఉండాలి. ఇలా ఐదారు నెలలు వేచియున్నా బోండా ధరతో సమానంగా విక్రయించలేని పరిస్థితి ఏర్పడింది.



పశ్చిమ కనుమల్లోనే అధిక దిగుబడి

రాష్ట్రంలో పశ్చిమకనుమలతోపాటు సముద్రతీరం, నదీపరీవాహకంతోపాటు వాతావరణంలో తేమశాతం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కొబ్బరిసాగుకు అనుకూలంగా ఉంటుంది. ఇలా రాష్ట్రంలో దాదాపు పది జిల్లాల్లో దశాబ్దాల కాలంగా కొబ్బరిసాగు చేస్తున్నారు. వాతావరణంతో సంబంధం లేకుండా పొలంగట్లపై కొబ్బరిచెట్లు సాగు చేసే విధానం ఉంది. పూర్తిస్థాయిలో కొబ్బరి తోటల పెంపకం పది జిల్లాల్లో కొనసాగుతోంది. కానీ కొబ్బరి దిగుబడి తగ్గడం, రోగాలు వెంటాడుతుండడంతో లాభదాయకమైన వక్కసాగువైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు. టెంకాయ తరహాలోనే వక్క కూడా ఒకసారి నాట్లు వేసి నాలుగైదేళ్ల కాపాడుకుంటే ఆ తర్వాత దశాబ్దాల కాలంపాటు దిగుబడి ఉంటుంది. రాష్ట్రంలోనే కాకుండా కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులలోనూ దిగుబడి తగ్గినట్లు తెలుస్తోంది. దిగుబడి తగ్గడంతో కొబ్బరిధర పెరిగింది. ఎండు కొబ్బరి కిలో రూ.200-300 కుపైగా ఉండేది. మరో ఒకటిరెండు నెలల్లో ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉంది.



లగ్గెరెలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న బోండాలు



ఆర్‌టీ నగర్‌లో బోండాల అమ్మకాలు

కొబ్బరి నీటికి పెరిగిన డిమాండ్

వేసవి కాలం అయినందున కొబ్బరి నీటికి డిమాండ్ పెరిగింది. టెంకాయలు సాధారణంగా వాటి సైజునుబట్టి విక్రయిస్తారు. చిన్నకాయలు 10-15 రూపాయలదాకా ఉండేది. మీడియం రూ.20-30, పెద్దవి రూ.40దాకా ధర ఉండేది. ఇటీవల చిన్నకాయలు రూ.30దాకాను, మీడియం కాయలు రూ.40దాకా, పెద్దకాయలు రూ.60దాకా పలుకుతున్నాయి. దక్షిణాదిన సాగు ఎక్కువగా ఉండగా ఉత్తరభారత్‌లో వినియోగం అత్యధికంగా ఉంటుంది. కేరళవాసులు కొబ్బరినూనెతో వంటకాలు చేస్తారు. ఉత్తరభారత్‌లో ప్రధానంగా స్వీట్లకు ప్రాధాన్యం ఉంటుంది. ఇలా ఉత్తరభారత్‌లో తయారయ్యే ప్రతి స్వీట్‌కు కొబ్బరిని తప్పనిసరిగా వినియోగిస్తారు. ఇక ఎండాకాలం పెరగడంతోపాటు జబ్బులబారిన పడినవారు కోలుకునేందుకు కొబ్బరినీళ్లు తప్పనిసరిగా వాడుతారు. ఒకప్పుడు అప్పటికప్పుడు మాత్రమే కొబ్బరి నీరును బోండాల ద్వారా తీసుకునేవారు. కానీ ఇటీవల కొబ్బరినీరు కూడా ప్యాకేజ్ రూపంలో విక్రయిస్తున్నారు. కొబ్బరినీరు రోగనియంత్రణతోపాటు ఆరోగ్యానికి మంచిదనేది తెలిసిందే.



చెట్టుపై కొబ్బరి బోండాలు

కొబ్బరి దిగుబడి పెంపునకు పరిశోధనలు చేయాలి

కొబ్బరి దిగుబడి పెంపునకు పరిశోధనలు పెరగాల్సి ఉందని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కొబ్బరి అభివృద్ధి మండలికి మరింత ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహించాలని కోరుతున్నారు. దశాబ్దాలకాలంగా కొబ్బరిసాగుతోనే జీవనం సాగిస్తున్న వేలాది కుటుంబాలకు నష్టం కలగకుండా పరిశోధనలు చేయాల్సి ఉంది.




గవిసిద్ధేశ్వర మఠంలో బసవనగౌడ పాటిల్ యత్నాల్

నేను కాంగ్రెస్‌లో చేరడమా..?

● విలేకరులపై మండిపడ్డ యత్నాళ్

బెంగళూరు/గంగావతి రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): నేను కాంగ్రెస్‌లో చేరడమా...? ఎప్పటికీ జరగదని విజయపుర ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్‌యత్నాళ్ మండిపడ్డారు. రానున్న రోజుల్లో బీజేపీని శాసించేలా మారిన తండ్రీకొడుకులు యడియూరప్ప, విజయేంద్రలపై పోరాటం కొనసాగిస్తానన్నారు. 2028లో నేనే సీఎం అవుతానన్నారు. కొప్పళ గవిమఠాన్ని సందర్శించిన ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ నేను ఎవరికీ క్షమాపణలు చెప్పి బీజేపీలో చేరాలని అనుకోవడం లేదన్నారు. కాంగ్రెస్‌లో మిత్రులు ఉంటారని అంతమాత్రాన మాట్లాడకుండా ఉండగలమా అన్నారు. కాగా కాంగ్రెస్ ముస్లింలకు అనుకూలమైన పార్టీ అని... తాను ఎందుకు చేరుతానన్నారు. హుబ్బళ్ళిలో ధారవాడ గ్రామీణ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌ను భేటీ అయిన విషయం వివాదాలకు కారణమైంది. ఇంట్లో కూర్చునేది లేదని, ఇకపై రాష్ట్రమంతటా తిరుగుతానన్నారు. యడియూరప్ప పోక్సో కేసును సమగ్రంగా విచారిస్తే యడియూరప్ప జైలుకు పోక తప్పదన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజుగౌడ మాట్లాడుతూ యత్నాళ్ ఇప్పుడు స్వతంత్రుడని, ఒకటి కాకుంటే నాలుగు పార్టీలు ఏర్పాటు చేయవచ్చునన్నారు. తండ్రీకొడుకులు వీరశైవ లింగాయతులను రిజర్వేషన్లు కల్పించకుండా తప్పించుకున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి రాజకీయ నిర్ణయం ప్రకటిస్తానన్నారు. రాష్ట్రంలోని బీజేపీని హైకమాండ్ యడియూరప్పకు లీజుకు ఇచ్చిందా? ఆ కుటుంబానికి అమ్మేశారా? అన్న ప్రశ్నను రాష్ట్ర ప్రజలకే వదిలేస్తున్నానన్నారు.






నల్ల బ్యాడ్జీతో ప్రార్థనలో పాల్గొన్న మంత్రి

రాష్ట్రవ్యాప్తంగా రంజాన్ వేడుకలు

బెంగళూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతటా రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. 30 రోజుల ఉపవాసదీక్ష అనంతరం నెలవంక దర్శనమివ్వడంతో ఆదివారం రాత్రి నుంచే పండుగ సంబరాలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం నుంచే ఈద్గా మైదానాలకు కుటుంబ సభ్యులతో పాటు తరలివచ్చారు. ప్రతిచోటా ప్రార్థనలు కొనసాగాయి. ఖురాన్‌లోని ముఖ్యఘట్టాలను ముతవల్లీలు వివరించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకొన్నారు. రాష్ట్రమంతటా ఒకేసారి పండుగ జరుపుకోవడం ప్రత్యేకం అనిపించింది. ఏటా కేరళ, దుబాయ్‌లకు అనుగుణంగా తీరప్రాంత జిల్లాల్లో పండుగ చేసుకునేవారు. ఈ ఏడాది కేరళలో నెలవంక దర్శనమివ్వడంతో ఒకేసారి పండుగ చేసుకున్నారు. ఈద్గా మైదానాల వద్దకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు వెళ్లి ఈద్ ముబారక్ చెప్పారు. బెంగళూరులోని చామరాజపేట, ఖుద్దూసాబ్ ఈద్గా మైదానం, బన్నేరుఘట్ట రోడ్డు, యలహంక, మైసూరు రోడ్డు, కనకపుర రోడ్లలో ప్రార్థనలు సాగాయి. మైసూరు, మండ్య, బీదర్, కలబురగి, చిక్కబళ్ళాపుర, కోలారు, బాగల్కోటె, బెళగావి, ఉడుపి, దక్షిణకన్నడ, చిక్కమగళూరు, శివమొగ్గ, హాసన్, హుబ్బళ్ళి-ధారవాడలలో జరిగిన ప్రార్థనలకు పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు. పండుగ తర్వాత మిత్రులు, బంధువులను విందుకు ఆహ్వానించారు. కాగా కేంద్రప్రభుత్వం తలపెట్టిన వక్ఫ్‌సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ వక్ఫ్ వసతి శాఖ మంత్రి జమీర్‌అహ్మద్‌ఖాన్, బీదర్‌లో మునిసిపల్ వ్యవహారాల శాఖ మంత్రి రెహమాన్‌ఖాన్‌లతోపాటు వందలాది మంది నల్లపట్టీలను చేతికి కట్టుకుని ప్రార్థనల్లో పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు



దొడ్డ బసవేశ్వరస్వామిని తాకిన సూర్యకిరణాలు

బసవేశ్వరుడిని తాకిన భానుడు

కంప్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని కురుగోడు పట్టణంలో ప్రసిద్ధి గాంచిన కురుగోడు దొడ్డ బసవేశ్వరస్వామి ఆలయంలో అపురూప దృశ్యం ఆవిష్కరించింది. బసవేశ్వరుడి మూలవిరాట్టును సోమవారం సాయంత్రం సూర్యకిరరణాలు తాకాయి. ఈ దృశ్యాన్ని తిలకించడానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉగాది పండుగ రోజు హంపిలో విరుపాక్షేశ్వరి విగ్రహాన్ని సూర్యకిరణాలు తాకాయి. మరునాడు సాయంత్రం హంపి ఎదురు బసవన్న పిలవబడే బసవేశ్వరుడిని సూర్యకిరణాలు తాకాయి. ఈ సమయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ఉగాది తర్వాత సూర్యకిరణాలు తాకడం శుభపరిణామని, ఇలా జరిగితే సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు, రైతులు సుఖశాంతులతో జీవనం కొనసాగిస్తారని అభిప్రాయపడ్డారు.

కసాపురంలో వైభవంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గుంతకల్లు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ ఉత్సవాల్లో భాగంగా కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివార్ల రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం ఆలయంలో నెట్టికంటి మూల విరాట్టుకు అభిషేకాలు, ప్రత్యేకాలంకరణలు చేశారు. ఉదయం నుంచి పూజాదికాలను నిర్వహించారు. సాయంత్రం ఆలయం దక్షిణ గోపురం ఎదుట రథాన్ని ఉంచి సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వాముల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి అలంకారాలు చేశారు.ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుటుంబ సమేతంగా పాల్గొని రథోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయం వద్ద నుంచి గ్రామంలోని సీతారామ స్వామి ఆలయం వరకూ రథాన్ని లాగారు.

పంచాంగానికి ప్రత్యేక పూజలు

బెంగళూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సరానికి సంబంధించి ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం సిద్ధం చేసిన పంచాగానికి యలహంక చౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఉగాది పండుగ సందర్భంగా చౌడేశ్వరి అమ్మవారి విగ్రహం వద్ద ఆంధ్రజ్యోతి పంచాగం పుస్తకాలు ఉంచి పూజలు చేశారు. ఆంధ్రజ్యోతి జనరల్ మేనేజర్ జీవీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా అర్చకులతోపాటు పలువురికి పంచాగం పుస్తకాలను పంపిణీ చేశారు.



అలంకరణలో చౌడేశ్వరీదేవి



అర్చకులకు పంచాంగం అందజేస్తున్న ఆంధ్రజ్యోతి జీఎం శ్రీకాంత్


శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి


ఎమ్మిగనూరు ప్రార్థనల్లో ఎమ్మెల్యే జేఎన్ గణేష్


ప్రార్థనలో పాల్గొన్న ఎంపీ తుకారామ్

ఘనంగా సామూహిక ప్రార్థనలు

● ఉభయ జిల్లాల్లో రంజాన్ వేడుకలు ● ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

బళ్లారి సిటీ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా సోమవారం సామూహిక ప్రార్థనలు ఘనంగా జరిగాయి. ఉభయ జిల్లాల్లో రంజాన్ పండగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. నగరంలోని ఈద్గా మైదానంలో ప్రార్థనలకు భారీగా తరలివచ్చారు. పలువురు ప్రముఖులు ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ ఈ.తుకారాం, రాజ్యసభ సభ్యుడు సయ్యద్ నాసీర్ హుస్సేన్, ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు తదితరులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. నెలరోజులు ఉపవాసం చేపట్టిన ముస్లింలు ఉపవాసాలు వీడి, దానధర్మాలతో పండగ జరుపుకుని దాతృత్వం చాటుకున్నారు.

మహిళల ప్రార్థనలు..

విజయనగరం జిల్లా హరపనహళ్ళి తాలూకాలో సోమవారం ఈద్-ఉల్-ఫితర్‌ను ఉత్సాహంగా జరుపుకున్నారు. మహిళలు ప్రార్థనల్లో పాల్గొని ప్రత్యేకత చాటుకున్నారు. హొసపేటరోడ్డులోని దర్గా ప్రాంగణంలో ఆలీ ఆడీస్ శాఖకు చెందిన పురుషులు ఈద్ ఉల్-ఫితర్ (రంజాన్)ప్రార్థనలు చేయగా, అదే శాఖకు చెందిన మహిళలు ఏర్పాటు చేసిన ప్రత్యేక గుడారంలో ప్రార్థనలు చేశారు. మౌల్వీ సర్థాత్ ఫజర్సాబ్ రంజాన్ పండుగ ప్రాముఖ్యతను దాని వేడుకల క్రమశిక్షణ గురించి అవగాహన కల్పించారు. ముస్లీం సమాజ నాయకులు బెల్దార్‌బాషా, జావిద్, దాదాపీర్, జాకీతర్ హుస్సేన్, మసాసాబ్, ఫమీవుల్లా, ఆల్తామాస్, సేక్షావలి, కాంగ్రెస్ బ్లాక్ కమిటీ అధ్యక్షుడు అంజినప్ప, వసంతప్ప, మంజునాయక్, సోగి ఇబ్రాహీం పాల్గొన్నారు.

ప్రముఖుల శుభాకాంక్షలు

బళ్లారి రూరల్(ఆంధ్రజ్యోతి): యుద్ధ మైదానానికి సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి వెళ్లి ముస్లిం సోదరులు ఆధ్వర్యంలో ప్రాంతంలో నిర్వహించారు. పెద్దఎత్తున ముస్లింలు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు నాసిర్ హుస్సేన్ సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మేయర్ నందీష్, వక్ఫ్ బోర్డు చైర్మన్ ఉమాయూన్ ఖాన్, కార్పొరేషన్ సభ్యులు ఆసిఫ్ బాషా తదితరులు పాల్గొన్నారు. నగరంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కర్ణాటక రక్షణ వేదిక శివరామగౌడ సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, రాజన్న ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.


హొసపేటలో సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

సిరుగుప్పలో..

సిరుగుప్ప (ఆంధ్రజ్యోతి): తాలుకా వ్యాప్తంగా ముస్లింలు రంజాన్‌ను పురస్కరించుకుని ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం గురువులు ఖురాన్ గ్రంథాన్ని చదివి వినిపించారు. రంజాన్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేష్, సీఐ హనుమంతప్ప, ఎస్ఐ పరశురామ్, తదితరులు పాల్గొన్నారు.

తోరణగల్లులో..

తోరణగల్లు (ఆంధ్రజ్యోతి): ముస్లిం బంధువులు రంజాన్ పండుగను సండూ రు తాలుకా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఒకరికొకరు ముస్లిం బంధువులు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అలాగే సామూహికంగా ప్రార్థనలు చేసుకున్నారు.

కంప్లిలో..

కంప్లి (ఆంధ్రజ్యోతి): రంజాన్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయం ఈద్గా మైదానం చేరుకుని సామూహికంగా ప్రార్థనలు చేపట్టుకుంటున్నారు. కంప్లి, కురుగోడు, కుడితిని పట్టణంలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఎమ్మిగనూరు గ్రామంలో ఎమ్మెల్యే జేఎన్ గణేష్ ప్రార్థనలో పాల్గొన్నారు. పట్టణ పంచాయతీ స్థాయి సమితి అధ్యక్షుడు రాజశేఖర్ పాల్గొన్నారు. సదాకలి అన్వర్ జాకీర్ ఇషాక్ కనికెరె పంపాపతి, వెంకటరమణ బాబు, దొడ్డప్ప, ముస్లిం సమాజ పదాధికారులు పాల్గొన్నారు.

రాయచూరులో..

రాయచూరు (ఆంధ్రజ్యోతి): ఈద్-ఉల్-ఫితర్ పవిత్ర రంజాన్(ఈద్-ఉల్-ఫితర్) పండుగను ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించారు. 30 రోజుల ఉపవాస దీక్ష అనంతరం జరుపుకునే రంజాన్ సందర్భంగా నగరంలోని ఎక్లాస్‌పూర్ కోడ్డు కాకతీయ కాలనీ వద్ద కొత్త ఈద్గా మైదానంతో పాటు జిల్లా కోర్టు కాంప్లెక్ వద్ద ఉన్న పాత ఈద్గా వేలాది మంది భక్తులతో కిటకిటలాడింది.


ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు


హరపనహళ్లిలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు


మాట్లాడుతున్న రాజశేఖర్


తోరణగల్లులో..


కరవే అధ్యక్షుడి అభినందనలు


నీటి కోసం బిందెలను వరుసగా ఉంచిన గ్రామస్థులు

గొల్లరహట్టిలో తీవ్రమైన నీటి ఎద్దడి

కంప్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): సండూరు తాలుకాలోని గొల్లరహట్టిలో తాగు నీటి సమస్య తీవ్రంగా మారింది. వేసవి ప్రారంభం కావడంతో గ్రామాల్లో నీటి సమస్య మొదలయ్యాయి. అని గ్రామప్రజలు తెలిపారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో గొట్టపు బావుల్లో నీరు తగ్గిపోవడం, వేసవిలో కరెంటు సరఫరా లేకపోవడంతో నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను, ప్రజా ప్రతినిధులు కోరారు. గొల్లరహట్టి ప్రజలు కోరుతున్నారు. నీటి సమస్య వల్ల రైతులు, కూలీలు పనులకు వెళ్లకుండా ఇళ్లకే పరిమితం కావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాస్తో కూస్తో వచ్చిన నీటికి గంటల తరబడి క్యూలో నిలబడి నీరు తీసుకెళ్లే పరిస్థితి ఏర్పడిందని గ్రామప్రజలు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో తమ గ్రామంలో ఏ సమస్య వచ్చినా తీరుస్తామని కేవలం ప్రచారాలకు పరిమితమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంబరంగా చైత్రచిగురు కార్యక్రమం


విజేతలైన చిన్నారులతో సంస్కార భారతి సభ్యులు

బళ్లారి సిటీ,మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సందర్భంగా సంస్కార భారతి జిల్లా యూనిట్ చైత్ర చిగురు కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం బ్యాంక్ కాలనీ పార్క్‌లో వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సాయంత్రం కాలనీలోని గృహిణులకు రంగోలి పోటీ ,పిల్లలకు భారతీయ సాంప్రదాయ దుస్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షుడిగా యల్లనగౌడ శంకరబండె పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాకారుడు నేతిర ఘురామ్, ఇతర కళాకారులు పాల్గొన్నారు.

సంబరంగా రంగుల పండుగ


రాఘవేంద్ర కాలనీలో సంబరాలు

కంప్లి/బళ్లారి రూరల్/సిరుగుప్ప, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ మరుసటి రోజు జరుపుకునే రంగులాట వాడవాడలా అలరించింది. రంగులు చల్లుకుంటూ చిన్నారులు సంబరాలు జరుపుకున్నారు. హోలీ పండుగతో పాటు ఉగాది పండుగ సమయంలో కూడా గ్రామాల్లో రంగులు వేసుకుని ఐక్యతకు చాటుకోవడం ఆనవాయితీ. ఎమ్మిగనూరు, సిరిగేరి, కుడితిని పలు గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం సంబరాలు జరుపుకున్నారు.

శ్రీమంతుడు.. మైలార లింగేశ్వరుడు

● ఉభయ జిల్లాల్లో అత్యధిక ఆదాయం కలిగిన దేవాలయంగా గుర్తింపు
● ఏడాదిలో రూ. 3.53 కోట్ల కానుకలు ● రెండో స్థానంలో బళ్లారి కనకదుర్గమ్మ


మైలార లింగేశ్వరుడి ఆలయ ప్రధాన ద్వారం

బళ్లారి గాంధీనగర్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): బళ్ళారి, విజయనగర అఖండ జిల్లాల దేవాదాయ శాఖ పరిధిలోకి వచ్చే 1,299 దేవాలయాల పైకి హూవినహడగలిలో వెలసిన మైలారలో మైలార లింగేశ్వర దేవస్థానం రెండు జిల్లాల్లో అత్యంత ధనిక దేవాలయంగా పేరు సంపాదించుకుంది. గత ఏడాది 2023-24 సంవత్సరంలో మైలార లింగేశ్వర స్వామికి సుమారు 3.53 కోట్ల రూపాయల దేవాలయానికి కానుకల రూపంలో వచ్చినట్లు దేవదాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. రెండు జిల్లాల దేవాదాయ శాఖ ఏ-వర్గానికి చెందిన 12 దేవలయాలు ఉండగా, బీ-వర్గానికి చెందిన 12 దేవాలయాలు, సీ-వర్గానికి చెందిన 1275 దేవాలయాలు ఉన్నాయి. మైలార లింగేశ్వర దేవాలయం ఏ-వర్గం పరిధిలోకి వస్తుంది. అత్యధికంగా కానుకల రూపంలో సంగ్రహింప బడుతున్న మైలార లింగేశ్వర దేవాలయం ఆ స్థాయిలో బళ్లారి నగర ఆరాధ్య దేవత కనకదుర్గ దేవాలయం నిలుస్తుంది. దేవాలయానికి రూ 333.82 లక్షలు అంటే 3.35 కోట్ల రూపాయలు భక్తుల నుంచి కానుకలు అందినట్లు అధికారులు వివరిస్తున్నారు. మూడవ స్థానంలో హరపనహళ్ళిలోని ఉచ్చంగి దుర్గ ఉత్సవాంబ దేవాలయం తృతీయ స్థానంలో నిలుస్తుంది. 2023-24 సంవత్సరంలో 303.50లక్షలు అంటూ 3.05కోట్లా రూపాయలు భక్తుల నుంచి సంగ్రహణ జరిగింది. ఆతర్వాతి స్థానంలో హంపిలోని విరుపాక్షేశ్వర దేఎవాలయం 2.28 కోట్ల రూపాయలు, కొట్టూరులోని గురుబసవేశ్వర దేవాలయం 2.86 కోట్లు రూపాయలు, కురువత్తి మల్లికార్జున, బసవేశ్వర స్వామి దేవాయం 90.96లక్షలు, కురుగోడులోని దొడ్డ బసవేశ్వర దేవాయం 85.80లక్షలు, ఉజ్జయిని సిద్దేశ్వర స్వామి దేవస్థానం 71.83లక్షలు, బుక్కసాగర ఏకపడె నాగప్ప దేఎవాలయం 70.50లక్షలు, హరపనహళ్ళి గోణిబసవేశ్వర దేవాలయం 65.64లక్షలు, మరియమ్మనహళ్ళి లక్ష్మీనారాయ ఆంజనేయ స్వామి దేవాలయం 6.30లక్షలు, బళ్ళారి తాలూకా పరిధిలోని ఎత్తినబూదిహాల్ కట్టె బసవేశ్వర దేవాలయం 31.99లక్షలు సంగ్రహణ జరిగింది. ఇక బి వర్గానికి చెందిన 12 దేవాలయాల పైకి సిరుగుప్ప బలకుంది బన్ని మహాకాళమ్మ దేవాలయానికి 2023-24 సంవత్సరంలో అత్యధికంగా 38.47లక్షలు, రెండవ స్థానంలో బళ్ళారి నగరంలని కుమారస్వామి దేవాలయం రూ 27.82లక్షలు, మూడవ స్థానంలో హూవిన హడగలి మొదలఘటకు చెందిన అంజనేయస్వామి దేవాయలయానికి 25.14లక్షలు సంగ్రహణ జరిగింది. అనంతరం బళ్ళారి కోట మల్లేశ్వర దేవాలయం రూ 25.05లక్షలు, హోసూరమ్మ దేవస్థానం రూ 24.66లక్షలు, సోగి హడగలి వీరభద్రేశ్వర స్వామిదేవాలయం రూ 9.84లక్షలు, సిరుగుప్ప దరూరు వీరభద్రేశ్వర స్వామి దేవాలయం 9.87లక్షలు హొసపేట గ్రామ దేవత ఊరమ్మ దేవతస్థానం రూ.9.36లక్షలు, సోగి హడగలి బెట్ట మల్లేశ్వర స్వామి రూ 8.74లక్షలు, హొసపేట వడకరాయ రంగనాథ స్వామి ర 8.17 లక్షలు సంగ్రహణ జరిగిందని అధికారులు తెలుపుతున్నారు.

ఏ-వర్గం నుంచి రూ.743 కోట్లు

రాష్ట్రంలో ఏ-వర్గానికి చెందిన దేవాలయాల నుంచి 2023-24 సంవత్సరానికి సంబంధించి రూ.743కోట్ల రూపాయలు, బి బర్గానికి చెందిన దేవాయల నుంచి మొత్తం రూ 34.81 కోట్ల రూపాయలు సంగ్రహణ జరిగింది. ఇందులో బళ్లారి నగరంలోని కనకదుర్గమ్మ దేవాలయానికి 115.5 గ్రాముల బంగారు ఆభరణాలు భక్తులు కానుక రూపంలో రాగా, బలకుంది బన్ని మహాంకాళమ్మకు 63 గ్రాములు, హంపి విరుపాక్షేశ్వరుడికి 28.9గ్రాములు, దరూరు వీరభద్రేశ్వర స్వామి 20 గ్రాములు, ఎత్తినబూదిహాల్ కట్టె బసవేశ్వర స్వామికి 5గ్రామాలు, కోటమల్లేశ్వర స్వామికి 2గ్రాములు, బంగారు భక్తులు సమర్పించినట్లు తెలిసింది.

హోసూరు జోన్

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు


సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

హోసూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): హోసూరులో పవిత్ర రంజాన్‌ను పురస్కరించుకుని సామూహిక ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. ఎంపీ గోపినాథ్ పాల్గొని అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. బెంగళూరు మార్గంలోని పురాతన ఈద్గా మైదానం వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో 5వేలమందికిపైగా పాల్గొన్నారు. శాంతి, సౌభ్రాతృత్వం, సామరస్యాలకు ప్రతీకగా పండుగలు ఉంటాయని ఎంపీ పేర్కొన్నారు. మత్తిగిరి, తళి, రాయకోట్టై, డెంకణీకోట, బాగలూరు, బేరికై, శూలగిరి, కెలమంగలంతోపాటు పలు ప్రాంతాల్లో జరిగిన ప్రార్థనల్లో వేలాదిమంది ముస్లింలు పాల్గొన్నారు. ముతవల్లీలు ధార్మిక ప్రసంగాలు చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న ఎంపీ గోపీనాథ్


పుస్తకావిష్కరణలో ఎంపీ గోపీనాథ్, ఎమ్మెల్యే ప్రకాశ్ తదితరులు

మాతృభాషలో విద్యకు అవకాశం కల్పించండి

హోసూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలో విద్యార్థులు మాతృభాషలో విద్యను అభ్యసించేందుకు వీలు కల్పించాలని బస్తీ యువక బృందం కోరింది. హోసూరులోని ఆంధ్రసాంస్కృతిక సమితి కార్యాలయంలో ఆదివారం ఉగాది వేడుకలలో భాగంగా ప్రత్యేక పుస్తకాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా పాల్గొన్న కృష్ణగిరి ఎంపీ గోపినాథ్, హోసూరు ఎమ్మెల్యే ప్రకాశ్‌లను బస్తీ యువక బృందం విజ్ఞప్తి చేసింది. బస్తీ యువక బృందం అధ్యక్షులు డాక్టర్ వసంత్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా ఎంపీ గోపినాథ్, ఎమ్మెల్యే వై ప్రకాశ్, ఉపమేయర్ ఆనందయ్యలు పాల్గొన్నారు. ఎంపీ గోపినాథ్ మాట్లాడుతూ మాతృభాషలను రక్షించుకోవడం మనకు ఎంతైనా అవసరం ఉందన్నారు. తెలుగు సంఘాల కృషితో మన ప్రాంతంలో తెలుగుభాషను ఆదరిస్తున్నారన్నారు. ప్రముఖ రచయితలు డాక్టర్ వసంత్, ఇతర రచయితలు, భాషాభిమానులు పాల్గొన్నారు. సీనియర్ రచయితలంతా కనుమరుగు కావడంతో వర్ధమాన రచయితలను ప్రోత్సహించాల్సి ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. ఆంధ్ర సాంస్కృతిక సమితి సహా భాషాభిమానులు మరింత చొరవ చూపాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో తెలుగు భాషోద్యమ సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆదియమాన్ కళాశాలతో గ్రీన్ ఫౌండేషన్ ఒప్పందం

హోసూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఆదియమాన్ ఇంజనీరింగ్ కళాశాలతో తిరువణ్ణామలైకు చెందిన ఎఫ్5 గ్రీన్ ఫౌండేషన్‌తో అవగాహనా ఒప్పందం కుదిరింది. పర్యావరణ పరిరక్షణ, బయో రీసోర్సెస్ అధికారిక శిక్షణపై విద్యార్థులకు ప్రయోజనం కల్పించేలా పలు కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు పర్యావరణ ప్రయోగశాలలు, పరిశోధన కేంద్రాలు, పారిశ్రామిక సంస్థల మధ్య సహకారం దోహదపడనుంది. కార్యక్రమంలో ఆదియమాన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధాకృష్ణన్, బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మణివాసకన్, గ్రీన్ ఫౌండేషన్ ఎండీ రేణుక, ఆచార్యులు మణిశ్రీధర్, జనని పాల్గొన్నారు.


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రముఖులు

వేడినీటి బకెట్ బోల్తా - చిన్నారి మృతి

హోసూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): వేడినీరు బకెట్ బోల్తా పడిన ఘటనలో మూడున్నరేళ్ల చిన్నారి మృతి చెందింది. తిరువణ్ణామలై జిల్లా సెంగం ప్రాంతానికి చెందిన భూబాలన్ స్థానిక కుముదేపల్లి సమీపాన కుటుంబంతో కలసి ఉంటూ భవన నిర్మాణ పనులలో ఉన్నాడు. భూబాలన్‌కు భార్య, మూడున్నరేళ్ల కుమార్తె వేదశ్రీ ఉన్నారు. ఈనెల 26న ఉదయం బాత్రూంలోని బకెట్‌లో వేడినీరు పోసి టవల్ తీసుకోవడానికి వెళ్లిన వేళ ఆటలాడుకుంటున్న వేదశ్రీ అటుగా వచ్చింది. వేడినీరు బక్కెట్ అదుపు తప్పి చిన్నారిపై పడింది. వెంటనే చిన్నారిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెగురైన చికిత్సకోసం దర్మపురి ప్రభుత్వ ఆసుపత్రికి మార్చు చేశారు. చికిత్సలు ఫలించక ఆదివారం కన్నుమూసింది. హడ్కో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పక్షులకు నీటి కుండీల ఏర్పాటు


కుండీలు ఏర్పాటుచేస్తున్న మహిళలు

కంప్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని వివిధ గ్రామాల్లో మహిళలు ఇళ్ల ముందు, పరిసర ప్రాంతాల్లో పక్షుల దాహం తీర్చడానికి కృషి చేస్తున్నారు. మండుతున్న వేసవిలో పక్షులు దాహానికి విలవిలలాడకుండా అక్కడక్కడా నీటి తొట్టిలు, కుండీలు ఏర్పాటు చేస్తున్నారు. ఆహారం, తాగునీరు ఏర్పాటు చేసి పక్షుల సంరక్షణ చేస్తున్నారు. హడగలి పట్టణం, హనుమదేవనపల్లి గ్రామంలో సోమవారం చుట్టుపక్కల గ్రామాల్లో ధర్మస్థల గ్రామీణాభివృద్ధి యోజన నాలెడ్జ్ డెవలప్‌మెంట్ సెంటర్ సభ్యులు, మహిళలు భారీ వృక్షాలకు కుండీలు ఏర్పాటు చేశారు. అనితా శోభ రజని, గీత, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

నేడు పదో తరగతి సోషల్ పరీక్ష

అనంతపురం విద్య, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పదో తరగతి సోషల్ స్టడీస్ పరీక్ష మంగళవారం నిర్వహించనున్నట్లు అనంత డీఈఓ ప్రసాద్‌బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్ష ఉంటుందన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఒటోవాన్ బిస్మార్క్ (జయంతి)



ఒటో ఎడువార్డ్ లియోపాడ్ వాన్ బిస్మార్క్ 1815 ఏప్రిల్ 1న జన్మించారు. 1860-1890ల మధ్య జర్మనీ, యూరప్ రాజకీయాల్లో ఆధిపత్యం వహించిన సంప్రదాయ రష్యన్ రాజనీతివేత్త. 1871-1890 వరకు జర్మన్ సామ్రాజ్య తొలి ఛాన్సెలర్‌గా వ్యవహరించారు. 1862లో ప్రష్యన్ రాజు విల్‌హెల్మ్ 1 ప్రష్యా మినిస్టర్ ప్రెసిడెంట్‌గా బిస్మార్క్‌ను నియమించారు. ఆ పదవిలో 1873లో కొద్దికాలం విరామాన్ని మినహాయించి 1890 వరకు బిస్మార్క్ కొనసాగారు. యూరప్‌లో జర్మన్ సామ్రాజ్యం బలోపేతానికి కృషి చేశారు. 1898 జూలై 30న కన్నుమూశారు.

కోడి రామమూర్తి (జయంతి)




ప్రముఖ వస్తాదు కోడి రామమూర్తినాయుడు 1882 ఏప్రిల్ 1న శ్రీకాకుళం జిల్లా వీరఘట్టంలో జన్మించారు. ఇరవయ్యో శతాబ్దపు తొలిదశకాలలో తెలుగువారిలో పేరొందిన మల్లయోధుడు. 21 ఏళ్లకే ఛాతీపై ఒకటిన్నర టన్నులు, ఆపై 3 టన్నుల భారాన్ని మోశారు. రామమూర్తి సర్కస్‌సంస్థ పలు చోట్ల ప్రదర్శనలిచ్చి మంచి పేరు పొందింది. 1600 మందిగల తన బృందంతో లండన్‌కు వెళ్ళి ప్రదర్శనలివ్వగా అప్పటి ఇంగ్లండ్ పాలకులైన కింగ్‌జార్జ్, క్వీన్ మేరీలు 'ఇండియన్ హెర్క్యులెస్' బిరుదుతో సత్కరించారు. కలియుగ భీమ, మల్ల మార్తాండ తదితర బిరుదులు సొంతం చేసుకున్నారు. 1942 జనవరి 16న కన్నుమూశారు.

కేబీ హెడ్గేవార్ (జయంతి)



ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు కేశవ్ బలీరాం హెడ్గేవార్ 1889 ఏప్రిల్ 1న నాగ్‌పూర్‌లో తెలుగు మాట్లాడే కుటుంబంలో జన్మించారు. దేశభక్తిని ప్రబోధించే హిందుత్వ భావనను వ్యాప్తి చేసేందుకు 1925లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)ను స్థాపించారు. స్వామి వివేకానంద, అరబిందో వంటి హిందూ సామాజిక, ఆధ్యాత్మిక సంస్కర్తల ప్రభావానికిలోనై మౌలిక భావజాలాన్ని నిర్మించారు. కాలక్రమంలో దేశవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ విస్తృతమైంది. 1940 జూన్ 21న కన్నుమూశారు.

అజిత్ వాడేకర్ (జయంతి)



క్రికెట్‌లో అంతర్జాతీయస్థాయిలో పేరొందిన అజిత్ లక్ష్మణ్ వాడేకర్ 1941 ఏప్రిల్ 1న బాంబేలో జన్మించారు. 1966 నుంచి 1974 వరకు క్రికెట్‌లో దేశం తరఫున పలుమార్లు ప్రాతినిధ్యం వహించారు. 1971లో దేశ క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారు. ఫిజికల్లీ చాలెంజ్‌డ్ వారికోసం ప్రత్యేకంగా ఇండియన్ క్రికెట్ జట్టుకు శ్రీకారం చుట్టారు. అర్జున అవార్డు, పద్మశ్రీ, సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు. 2018 ఆగస్టు 15న కన్నుమూయగా రాష్ట్ర గౌరవాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

» ఈద్గా మైదానాల్లో సామూహిక ప్రార్థనలు



చింతామణిలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లిలు



బాగేపల్లిలో ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి



శిడ్లఘట్టలో పూర్వీకుల సమాధుల వద్ద ప్రార్థనలు

శిడ్లఘట్ట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట పట్టణం సహా తాలూకా వ్యాప్తంగా ఈద్-ఉల్-ఫితర్‌ను ముస్లింలు ఘనంగా ఆచరించారు. పలు ఈద్గా మైదానాల వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. జామియా మసీదు నుంచి ఊరేగింపుగా బయల్దేరి నీలాద్‌బాగ్ మైదానానికి చేరుకున్నారు. మిలాద్‌బాగ్ ఈద్గా సమితి ద్వారా సామూహిక ప్రార్థనలకు బయల్దేరినవారికి కేపీసీసీ కన్వీనర్ రాజీవ్‌గౌడ అనుచరులు తాగునీరు, నిమ్మరసం సమకూర్చారు. సామూహిక ప్రార్థనల అనంతరం తమ పూర్వీకుల సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ముతవల్లీ ఇక్రామ్ ఉల్ హక్ ఖాదిరి రంజాన్ మాస పవిత్రతను, ఇస్లాం ధర్మ శాంతి సౌహార్ద్రతను తెలియచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. జేడీఎస్ నాయకులు ముషీర్, తాదూరు రఘు, రహంతుల్లా, ఫయాజ్, తాజ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

బంగారపేటలో...

బంగారపేట: బంగారపేట పట్టణంలోని దర్గా మైదానంలో రంజాన్‌ను పురస్కరించుకుని సోమవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి పాల్గొని మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసదీక్షలతో ముస్లింలు కొనసాగి దానధర్మాలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షులు గోవింద, ఉపాధ్యక్షురాలు చంద్రవేణి మంజునాథ్, పీఎల్‌డీ బ్యాంకు డైరెక్టర్ హెచ్‌కే నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

షాదీమహల్‌కు ప్రహరీ: ఎమ్మెల్యే

బాగేపల్లి: పట్టణంలోని షాదీమహల్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించనున్నట్టు ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి భరోసా ఇచ్చారు. కొడికొండరోడ్డులోని ఈద్గా మైదానంలో రంజాన్ సందర్భంగా ఏర్పాటైన సామూహిక ప్రార్థనల్లో నూతనంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన షాదీమహల్ చుట్టూ రక్షణాగోడ నిర్మిస్తామన్నారు. సీఎం సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి బడ్జెట్‌లో పలు పథకాలు ప్రకటించిందన్నారు. కాగా కేంద్రంఉద్దేశించిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నల్లపట్టీని ఎడమ చేతికి ధరించి నిరసన తెలిపారు. ఉదయం 16 మసీదులనుంచి ర్యాలీగా కొడికొండ రోడ్డులోని ఈద్గా మైదానానికి చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ధర్మగురువు మౌలానా అబ్దుల్ ఫయాజ్ ప్రధాన ప్రసంగం చేశారు. పురసభ అధ్యక్షుడు ఏ శ్రీనివాస్, సభ్యులు గడ్డం రమేశ్, బీఏ బాబాజాన్, బషీర్ అహ్మద్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

చింతామణిలో...

చింతామణి: చింతామణి పట్టణం సహా తాలూకా వ్యాప్తంగా ఈద్‌ఉల్ ఫితర్‌ను ముస్లింలు ఘనంగా ఆచరించారు. వేకువజామున నమాజ్ అనంతరం నూతన వస్త్రాలు ధరించి మసీదులకు వెళ్లి అక్కడనుంచి ఈద్గా మైదానానికి చేరుకున్నారు. దొడ్డపేటలోని జామియా మసీదునుంచి ముస్లింలు ర్యాలీగా బాగేపల్లి సర్కిల్‌లోని ఈద్గా మైదానానికి చేరుకుని సమూహిక ప్రార్థనలు చేశారు. మౌల్వీలు ప్రత్యేక ప్రసంగాలు చేశారు. పర స్పరం ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. పండుగ సందర్భంగా అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ మురళిధర్ నేతృత్వంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

బొమ్మనహళ్ళిలో...

బొమ్మనహళ్ళి: రంజాన్ సందర్భంగా బండెపాళ్య, కావేరినగర్‌లలోని ఈద్గా మైదానంలో వేలాదిమంది ముస్లింలు పాల్గొని సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. దానధర్మాలకు, పవిత్రతకు నిదర్శనంగా రంజాన్ ఉందని ముతవల్లీలు పేర్కొన్నారు. స్థానిక ప్రముఖులు సయ్యద్ సలాం, సయ్యద్ సర్దార్, బీఎంఎస్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు. కావేరినగర్‌లో ఈద్గా మైదానాన్ని బాగు చేసిన సమాజసేవకుడు రాజును స్థానికులు ఆత్మీయంగా సత్కరించారు.

నెలలోగా ఈద్గాకు ప్రహరీ : మంత్రి మునియప్ప

విజయపుర: నెలలోగా చిక్కబళ్ళాపుర రోడ్డులోని ఈద్గా మైదానానికి ప్రహరీగోడ నిర్మించనున్నట్టు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కేహెచ్ మునియప్ప తెలిపారు. రంజాన్ పురస్కరించుకుని దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణం చిక్కబళ్ళాపుర రోడ్డులోని ఈద్గా మైదానంలో సోమవారం ఏర్పాటైన సామూహిక ప్రార్థనల్లో పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్యం పోరాటానికి ముందు నుంచి హిందూ ముస్లింలు కలసికట్టుగా సాగారని, అనంతరం ఐకమత్యంతో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా మంత్రిని ఆత్మీయంగా సత్కరించారు. పురసభ మాజీ అధ్యక్షుడు ఎం సతీశ్‌కుమార్, బెంగళూరు గ్రామీణ జిల్లా మైనారిటీ విభాగం కాంగ్రెస్ అధ్యక్షుడు ముబారక్, విజయపుర బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామచంద్రప్ప, జడ్పీ మాజీ అధ్యక్షుడు బి రాజణ్ణ, కేపీసీసీ మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శి ఖలీం తదితరులు పాల్గొన్నారు. తొలుత పట్టణంలోని వివిధ మసీదులనుంచి జామియా మసీదు వద్దకు అందరూ చేరుకున్నాక మౌల్వి నేతృత్వంలో ర్యాలీగా ఈద్గా మైదానానికి చేరుకున్నారు.



బంగారపేటలో ప్రార్థనల్లో ఎమ్మెల్యే నారాయణస్వామి



విజయపురలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి మునియప్ప



కావేరినగర్‌లో సమాజసేవకుడు రాజుకు సన్మానం

14న అంబేడ్కర్ భవనానికి భూమిపూజ



మీడియా సమావేశంలో ఎమ్మెల్యే రవికుమార్ తదితరులు

శిడ్లఘట్ట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అంబేడ్కర్ భవనం నిర్మాణానికి ఏప్రిల్ 14న భూమిపూజ, అదే విధంగా ఉపాధ్యాయుల భవనం, ప్రభుత్వ ఉద్యోగుల భవనానికి పునాదిరాయి వేయనున్నట్టు ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ ప్రకటించారు. మేలూరు గ్రామంలోని తమ గృహ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. శిడ్లఘట్ట పట్టణంలో ఇంటింటికీ తాగునీరు, డ్రైనేజీ కనెక్షన్ ఇచ్చే పనులు ఇటీవలే పూర్తయ్యాన్నారు. ప్రస్తుతం వార్డులలో రోడ్లు బాగు చేయి, వీధి దీపాలు అమర్చి స్వచ్ఛత కాపాడేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం రెండో దశ పనులు సాగుతున్నాయని, అమృత పథకం కింద ఇంటింటికీ తాగునీరు అందించే పనులు ప్రారంభమయ్యాయని, ప్రధానంగా సుమారు రూ.10కోట్లతో అంబేడ్కర్ భవనం చేపట్టదలిచామని ఇందుకు ఏప్రిల్ 14న భూమిపూజ ఉందన్నారు. ఈ కార్యక్రమం చిరస్మరణీయం కానుందని పార్టీలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. మీడియా సమావేశంలో తాదూరు రఘు, కొత్తనూరు లక్ష్మీపతి, భక్తరహళ్ళి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పరుగు



యువతుల పరుగు ఇలా..

బెంగళూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): సిస్టా రన్ పేరిట నిర్వహించిన మారథాన్‌లో వేలాదిమంది యువతులు ఉత్సాహంగా పరుగులుదీశారు. సిస్టర్ ఇన్ స్వీట్ కో-ఫౌండర్ శ్వేత సుబ్బయ్య ఆధ్వర్యంలో పోటీలు సాగాయి. బ్రూక్‌ఫీల్డ్ ప్రాపర్టీస్ ప్రాంగణంలో 10కే, 5కే, 3కే ఫన్ రన్ పోటీలు నిర్వహించారు. శ్వేత సుబ్బయ్య మాట్లాడుతూ.. మహిళల్లో ఆరోగ్యం పెంపొందించుకోవడంతోపాటు అన్ని రంగాల్లో భాగస్వాములు కావాలని, చైతన్యం పెంపొందించేలా రన్ ఏర్పాటు చేశామన్నారు. మిరాకి స్పోర్ట్స్ ప్రతినిధి షర్బాత్ అస్నీమ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

'బీజేపీ జిల్లా అధ్యక్ష పదవి ఇస్తే నిర్వహిస్తా'

శిడ్లఘట్ట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): చిక్కబళ్ళాపుర జిల్లా బీజేపీ అధ్యక్షస్థానం ఇస్తే అంగీకరించి చక్కగా నిభాయిస్తానని, పార్టీ తీర్మానానికి కట్టుబడి ఉంటానని బీజేపీ సీనియర్ నాయకుడు సీకల్ రామచంద్రగౌడ పేర్కొన్నారు. పట్టణంలోని బీజేపీ సేవాసౌధలో సమావేశంలో ఉగాది, రంజాన్ సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర కిట్లు పంపిణీ చేసి మాట్లాడారు. జిల్లా అధ్యక్షస్థానం రేసులో ఉన్నానని అవకాశం దక్కితే అందరినీ పరిగణనలోకి తీసుకుని ముందుకు సాగుతానన్నారు. పార్టీ పెద్దల ఆదేశాలకు అనుగుణంగా ప్రామాణికంగా పనిచేస్తానన్నారు. పండుగలను అర్థవంతంగా చేసుకునేందుకు కిట్లు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీకల్ ఆనందగౌడ, సోమశేఖర్, నగరసభ సభ్యుడు, బీజేపీ ప్రముఖుడు నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో సీకల్ రామచంద్రగౌడ

రాణించిన బీఎన్ఎంఐటీ జట్టు



బీఎన్ఎంఐటీ జట్టుతో ప్రముఖులు

బెంగళూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ అకాడమీ ఆఫ్ టెక్నాలజీలో రాష్ట్రస్థాయి వీటీయూ యువ ఉత్సవ్ పోటీల్లో బీఎన్ఎంఐటీ విద్యార్థులు రాణించారు. విశ్వేశ్వరయ్య సాంకేతిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నాలుగురోజుల యువ ఉత్సవ్‌కు రాష్ట్ర వ్యాప్తంగా వందకుపైగా కళాశాల బృందాలు భాగస్వామ్యం అయ్యాయి. బీఎన్ఎంఐటీ కళా భాగీరథి సాంస్కృతిక బృందం నాలుగు బంగారం, నాలుగు వెండి, రెండు కాంస్య పతకాలను సాధించినట్టు బీఎన్ఎంఐటీ చైర్మన్ నారాయణరావు మానె సంతోషం వ్యక్తం చేశారు. పోటీలకు విజయ రాఘవేంద్ర, గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల ఐశ్వర్య హెగ్డేతోపాటు పలువురు పాల్గొన్నారన్నారు.

హొరగద్దె వ్యవసాయ సంఘం కాంగ్రెస్ వశం



నూతన డైరెక్టర్లకు సన్మానం

దొమ్మసంద్ర, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా హొరగద్దె వ్యవసాయ సేవా సహకారసంఘానికి 12 మంది డైరెక్టర్ల స్థానాలకు జరిగిన ఎన్నికల్లో అందరూ కాంగ్రెస్ మద్దతుదారులు గెలుపొందారు. నూతన డైరెక్టర్‌లను ఆత్మీయంగా సత్కరించి మిఠాయిలు తినిపించారు. హొరగద్దె కేఎస్ నటరాజ్, అక్షయ్‌కుమార్, హేమంత్‌కుమార్, ఎన్ గొల్లహళ్ళి వెంకటస్వామి, మారప్ప, వివేక్, అశ్వత్థప్ప, శ్రీనివాస్, ఆంజినప్ప, రవికుమార్, మమత, మాల గెలుపుసాధించారు. కోనసంద్రలో ఏర్పాటైన గ్రామంలో నూతన డైరెక్టర్లను సత్కరించారు. కాంగ్రెస్ నాయకులు హెచ్ఎస్ బసవరాజ్, వెంకటేశ్, శ్రీధర్, బాబురెడ్డి, కే నాగభూషణ్, ప్రభాకర్, రవిచంద్ర, డైరి మునిరాజ్, కే నారాయణ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవి హుండీ ఆదాయం రూ.5.76 లక్షలు

చేళూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): చేళూరు తాలూకా సరిహద్దులోని అమడగూరులోని చౌడేశ్వరి దేవి ఆలయంలో ఉగాది సందర్భంగా ఆదివారం విశేష పూజలు జరిగాయి. సోమవారం మధ్యాహ్నం హుండీ ఆదాయం లెక్కించగా రూ.5.76లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ధర్మకర్త పురుషోత్తంరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఇతర సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సురేంద్రరెడ్డి, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. ఏప్రిల్ 16న జ్యోతి ఉత్సవం జరగనుందని ధర్మకర్త వెల్లడించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు జ్యోతి ఉత్సవంలో పాల్గొంటారన్నారు.

గొర్రెల కాపరి ఆత్మహత్య

కూడేరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): అప్పులు చేసి కొన్న గొర్రెలు వింత వ్యాధితో చనిపోతుండటంతో మనస్థాపం చెంది అనంతపురం జిల్లా కూడేరుకు చెందిన మారెన్న (44)అనే గొర్రెల కాపరి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. మారెన్న అనే గొర్రెల కాపరి రూ.8 లక్షల విలువ చేసే 150 గొర్రెలను కొనుగోలు చేశాడు. గత కొన్ని నెలలుగా వింత వ్యాధి సోకి దాదాపు 90 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గొర్రెలు మృతి చెందుతుండటంతో అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచక ఈ నెల 26న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య కుంటెమ్మ, ముగ్గురు కుమారులు సంతానం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తమ్ముడి చేతిలో అన్న హతం

లేపాక్షి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): అన్నదమ్ముల మధ్య జరిగిన గొడవలో తమ్ముడి చేతిలో అన్న మరణించిన సంఘటన లేపాక్షిలో జరిగింది. ఎస్ఐ నరేంద్ర తెలిపిన మేరకు లేపాక్షి గ్రామానికి చెందిన రామాంజనేయులు(45), అశ్వత్థప్ప అన్నదమ్ములు. రామాంజనేయులు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబ కలహాలతో అన్నదమ్ములిద్దరూ తరచూ గొడవ పడేవారు. ఆదివారం కూడా ఇద్దరూ మద్యం సేవించి గొడవ పడ్డారు. ఈక్రమంలోనే అశ్వత్థప్ప తన అన్న రామాంజనేయులును మిద్దెపై నుంచి కిందకు తోసేశాడు. తీవ్రంగా గాయపడిన రామాంజనేయులును కుటుంబ సభ్యు లు ఆటోలో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. , కుమార్తె, కుమారుడు ఉన్నారు.

చీనీ టన్ను రూ.26వేలు

అనంతపురం రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.26,300 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.5వేలు, సరాసరి రూ.13వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు.

నటుడు సాయికుమార్‌కు ఆంధ్రసంఘం సత్కారం

బెంగళూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా సంస్కృతి కోసం సేవలందిస్తున్న పూనెలోని ఆంధ్ర సంఘం విలక్షణ నటుడు సాయికుమార్‌ను సత్కరించింది. పూనెలో జరిగిన ఉగాది వేడుకల్లో సాయికుమార్ దంపతులను సత్కరించినట్టు బెంగళూరులో ఆంధ్రసంఘం ఒక ప్రకటన విడుదల చేసింది. సంఘం కార్యవర్గ సభ్యులు టీవీ శ్రీనివాస్, వంశీకృష్ణ, మోహన్ నాయుడు, వెంకటరెడ్డి, పీవీ గుప్త, రాఘవేంద్ర, ప్రద్యుమ్న, రాజశేఖర శర్మ, కాశిప్రసాద్‌లతోపాటు కుటుంబసభ్యులు పాల్గొన్నట్టు తెలిపారు.



నటుడు సాయికుమార్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు

శాంతిధామలో పంచాంగ శ్రవణం



పంచాంగ శ్రవణం చేస్తున్న నాగరాజ భట్

బొమ్మనహళ్ళి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఉగాదిని పురస్కరించుకుని అరికెరె శాంతినికేతన్ లేఅవుట్‌లో వెలసిన శాంతిధామలోని షిర్డీసాయిబాబా మందిరంలో విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణాన్ని ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజభట్ వినిపించారు. నూతన సంవత్సరంలో దాదాపు అన్ని చోట్లా వర్షాలు కురిసే అవకాశం ఉన్నాయని, అయినా కొన్ని చోట్ల రైతులకు ఇబ్బందులు తప్పవన్నారు. అన్ని రాశుల ఫలితాలను వివరించారు. ఏటా ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం చేస్తున్నామని ఆలయ కమిటీ కార్యదర్శి తాతయ్యగుప్త తెలిపారు. ఆదివారం స్వామివారికి అభిషేకం, అనంతరం భక్తులచే క్షీరాభిషేకం అవకాశం కల్పించారు. మంజునాథస్వామి ఆలయంలోనూ అభిషేకం, అలంకరణ చేశారు. భక్తులకు సంప్రదాయమైన ఉగాది పచ్చడితోపాటు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మనోహర్ గుప్త, కృష్ణయ్యశెట్టి, వెంకటేశ్‌గుప్త, సొరటూరు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరీల్లో చకాచకా బిల్లులు

అనంతపురం టౌన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరం ముగింపు కావడంతో ఖజానా శాఖలో సందడి కనిపించింది. ఉగాది, రంజాన్ పండుగలు మార్చి నెలాఖరులో రావడంతో సెలవు రోజుల్లో కూడా ఆ శాఖ ఉద్యోగులు పనిచేయాల్సి వచ్చింది. ఆది, సోమవారాలలో జిల్లాలోని ట్రెజరీ శాఖలు పనిచేశాయి. ప్రధానంగా కలెక్టరేట్‌లో ఉన్న ట్రెజరీ కార్యాలయం రెండురోజులుగా సందడిగా మారిది. గతంలో ప్రతి బిల్లూ ట్రెజరీలలో పాస్‌చేసి నేరుగా బ్యాంకులకు పంపించాల్సి ఉండేది. అపుడు సంబంధిత డబ్బును బ్యాంకులు ఆయా వ్యక్తుల ఖాతాల్లోకి జమచేసేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. వచ్చిన బిల్లులను ట్రెజరీ పరిశీలించి ఆమోదం వేసి సీఎఫ్ఎంఎస్‌లోకి పంపుతుంది. అక్కడ వాటికి ప్రభుత్వం ఆమోదం వేస్తే.. బిల్లులకు బ్యాంకులు డబ్బులు విడుదలచేసి ఖాతాల్లోకి జమచేస్తాయి. ప్రస్తుతం కేవలం సీఎఫ్ఎంఎస్‌లోకి అప్‌లోడ్‌చేయడమే కావడంతో ట్రెజరీశాఖ సిబ్బంది నిరంతరాయంగా కార్యకలాపాలను కొనసాగించారు. అన్ని ప్రభుత్వ శాఖల నిధులు, వివిధ పథకాల పనులు, జీతాలు, అరియర్స్ బిల్లులకు సంబంధించిన బిల్లులు రావడంతో వాటిని పరిశీలించి సీఎఫ్ఎంఎస్‌లోకి నమోదు చేసి పంపించామని ట్రెజరీ అధికారులు తెలిపారు.